శబరిమల భక్తులకు ఆంక్షలు ఎత్తివేయాలి

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 11 : టీడీబీ ట్రావెన్ కోడ్ దేవస్థానంబోర్డ్ శభరిమల దర్శనం కోసం భక్తులకు విధించిన ఆంక్షల నుంచి విముక్తి కల్పించాలని శబరిమల మెల్శాంతి సమాజం అధ్యక్షుడు ఎగ్జోకోడ్ శశి నంబోద్రి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శబరిమల అభివృద్ధి కార్యక్రమాల్లో ఆశాస్రతీయ అంశాలను నివారించాలని, సహజసిద్ధమైన రీతిలో పనులు జరుగాలని, వర్చువల్ క్యూ వ్యవస్థను ప్రవేశపెట్టడంలో భక్తులకు నెయ్యి అభిషేకం కష్టమవుతున్నదని తెలిపారు. స్లాట్ బుకింగ్ అవకాశం ఇవ్వాలని, భక్తులకు సాఫీగా దర్శనం చేసుకునేందుకు వెసులుబాటు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచారసభ జాతీయ ప్రధాన కార్యదర్శి బేతి తిరుమల్ రావు వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఎంఎన్ రేజ్ కుమార్ నంబోద్రి, ట్రెజరర్ దామోదరన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, అక్టోబర్ 11 : శబరిమల అయ్యప్ప స్వామి దర్శనంపై ఆంక్షలు ఎత్తి వేయాలని శబరిమల మేల్‌శాంతి సమాజం డిమాండ్ చేస్తున్నదని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ జాతీయ ప్రధాన కార్యదర్శి బేతి తిరుమల్‌రావు తెలిపారు. అంగమలైలోని మేల్ శాంతి సమాజం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వివిధ రాష్ట్రాల నుంచి మేల్ శాంతి గురుస్వాములు, ఏబీఏపీ జాతీయ కమిటీ సభ్యులు పాల్గొన్నారని చెప్పారు. మేల్ శాంతి సమాజం అధ్యక్షుడు ఎజ్‌కోడ్ శసి నంబూద్రి, కార్యదర్శి ఎమ్ ఎన్ రెజికుమార్ నంబూద్రి, కోశాధికారి దామోదారన్ పొట్టి పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడ్డ యువకుల అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 11 : సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు బతుకమ్మ సంబురాలు చేసుకుంటుండగా, మంచిర్యాల పట్టణంలోని తిలక్ నగర్, సప్తగిరి కాలనీ, అశోక్ రోడ్‌లలో గొడవలకు పాల్పడిన ఎనిమిది మంది యువకులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. హమాలీవాడలోని చర్చి సమీపంలో మహిళలు బతుకమ్మ ఆడుతుండగా, శివాజీ యూత్ సభ్యులు శ్రావణ్, వంశీపై తాగిన మైకంలో శరత్, సురేశ్, అనిరుద్, అఖిల్ మరికొందరు దాడి చేశారు. సప్తగిరి కాలనీలో ప్రేమ వ్యవహారానికి సంబంధించి తోట తిరుపతిపై అగ్గు మారుతీతో పాటు, మరికొందరు యువకులు దాడి చేశారు. అశోక్ రోడ్‌లో అప్పు వ్యవహారానికి సంబంధించి సోహైల్‌పై రాజు శ్రావణ్, చిలుక సాయి మరికొందరు కార్ అద్దాలు ధ్వంసం చేసి కొట్టారు. ఈ న్యూసెన్స్ వ్యవహారాలకు సంబంధించి ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. మూడు సంఘటనల్లో బాధ్యులైన శరత్, సురేష్, అనిరుద్, అఖిల్, అగ్గు మారుతి, రాజు, శ్రావణ్, చిలుక సాయిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వెల్లడించారు. మిగతా వారిని కూడా త్వరలో అరెస్ట్ చేస్తామని తెలిపారు. పండుగ నేపథ్యంలో తాగిన మైకంలో గాని, డబ్బు వ్యవహారాలకు సంబంధించి గానీ, ఇతర విషయాలకు సంబంధించి గొడవలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. దసరా పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు నసత్ రెడ్డి, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

'15 లోగా రిలీవ్ కావాలి'

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 11 : విద్యుత్ ఉద్యోగులు బదిలీలకు సంబంధించిన ఆర్డర్లు వెలువరించాలని ఎన్పీడీసీఎల్ సీఅండ్ఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 8వ తేదీలోగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాల్సిన షెడ్యూల్ ఉన్నప్పటికీ వేరే జిల్లాల్లో పలు అంశాల్లో వివాదం తలెత్తడంతో బదిలీల ప్రక్రియను నిలిపివేశారు. తాజాగా శుక్రవారం రాత్రి బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు వెలవడ్డాయి. దీని ప్రకారం 11వ తేదీన బదిలీ ఆర్డర్లు ఉద్యోగులకు అందజేయాలి. బదిలీ అయిన ఉద్యోగులంతా 15 లోగా రిలీవ్ అయి వారికి కేటాయించిన స్థానాల్లో జాయిన్ అవ్వాలి. 12 నుంచి బదిలీలపై నిషేదాన్ని అమలు చేస్తారు. ఈ బదిలీ నియమ నిబంధనలను విద్యుత్ శాఖలో నిఫంక్షనల్ హెడ్స్, ఎస్ఈ లు, డీఈలు, ఏఏవో, ఈఆర్ వోలు అమలు చేయాల ని సీఎండీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 39 మంది లైన్‌మన్లు, 11 మంది అసిస్టెంట్ లైన్‌మెన్లు, 21 మంది లైన్ ఇన్‌స్పెక్టర్లు, 9 మంది ఏడీఈలు, 24 మంది ఏఈలు, జేఏవో, ఏవో, ఏఏఈ సివిల్, నలుగురు ఫోర్‌మెన్లు, 8 మంది సీనియర్ లైన్‌ఇన్‌స్పెక్టర్లు, 10 మంది సీనియర్ అసిస్టెంట్లు, నలుగురు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు రికార్డు అసిస్టెంట్లు, ఆరుగురు ఆఫీస్ సబార్డినేటుల బదిలీ కానున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331785-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677

శ్రీరాంపూర్ : వర్క్‌షాప్ మైసమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న జీఎం సంజీవరెడ్డి దంపతులు

రెబ్బెన : ఇందిరానగర్ కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళీ దేవస్థానంలో మహా చండీహోమంలో భక్తులు

లక్షెట్టిపేట : గోదావరి రోడ్డులోని మండపం వద్ద చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు

కొనసాగుతున్న శరన్నవరాత్రోత్సవాలు

మంచిర్యాల అర్బన్ : అమ్మవారి పూజల్లో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు కుటుంబ సభ్యులు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 11 : జిల్లాలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని విశ్వనాథ స్వామి కాలక్షేప మండపంలో సర్వజననీ దుర్గాదేవి నిర్వాహక మండలి బెంగాలీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయన సతీమని రాజకుమారి, కొడుకు, కోడలు విజిత్‌కుమార్–ఉదయశ్రీ అమ్మవారికి చీర సమర్పించి, ఓడిబియ్యం నింపారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అష్టమి పూజ కార్యక్రమంలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 3 నుంచి 9 గంటల వరకు 108 దీపాలు, 108 తామర పూలు, 9 కళశాలతో ప్రత్యేక పూజ, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బోడ ధర్మేందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు అత్తి సరోజ, బెంగాలీ మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ముల్కల్లలో..

హాజీపూర్, అక్టోబర్ 11 : హాజీపూర్ మండలంలోని ముల్కల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవికి మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని, ప్రారంభించారు. మాజీ సర్పంచ్ మంచాల శ్రీనివాస్‌తో పాటు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ వర్క్‌షాప్‌పై..

శ్రీరాంపూర్, అక్టోబర్ 11 : శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్ వద్ద మైసమ్మ దేవాలయంలో వర్క్‌షాప్ డీజీఎం బెజ్జవరం రవీందర్ ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించారు. జీఎం సంజీవరెడ్డి, సేవా సమితి ఆధ్యక్షురాలు రాధాకుమారి దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఆలయంలో జీఎం దంపతులు పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, పిట్ కార్యదర్శి సదానందం పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో..

రెబ్బెన, అక్టోబర్ 11 : రెబ్బెన మండలం ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళీ దేవస్థానంలో అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ఒడిబియ్యం, పట్టువస్త్రాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకుడు పూసాల మహేశ్‌శాస్త్రి, ఆలయ ప్రధాన అర్చకుడు దేవర వినోద్ స్వామి ఆధ్వర్యంలో మహా చండీహోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. విజయదశమి సందర్భంగా శనివారం ఆలయంలో వాహనపూజలు, సాయంత్రం అమ్మవారి పల్లకీ సేవ ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మోడెం తిరుపతిగౌడ్, మధు, గంగాధర్, ఉదయ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేటలో..

లక్షెట్టిపేట, అక్టోబర్ 11 : లక్షెట్టిపేట పట్టణంలోని గోదావరి రోడ్డులో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద మహామంగళప్రద చండీ హోమం నిర్వహించారు. వేద పండితులు ముద్దు ప్రణవ్ శర్మ మహా మంగళ ప్రద చండీ హోమం ప్రాముఖ్యతను వివరించారు. పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. పూజకు హాజరైన భక్తులకు నిర్వాహకులు అన్ని సౌకర్యాలు కల్పించారు.

అంతర్జాతీయస్థాయి సౌకర్యాలతో గురుకులాలు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- రెబ్బెన్‌పెల్లిలో యంగ్ ఇండియా సమీకృత గురుకులానికి భూమిపూజ

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే, జీసీసీ చైర్మన్

దండేపల్లి, అక్టోబర్ 11 : కులమతాలకు అతీతంగా అంతర్జాతీయస్థాయి సౌకర్యాలతో అత్యంత ప్రామాణికమైన విద్య అందించేందుకు ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను నిర్మిస్తున్నదని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. దండేపల్లి మండలం రెబ్బెన్‌పెల్లిలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుతో కలిసి శుక్రవారం సమీకృత గురుకుల పాఠశాల సముదాయ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. గురుకులాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు, ఈ క్రమంలోనే సమీకృత గురుకుల పాఠశాల సముదాయ భవనానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. అందుకు ప్రభుత్వం 22 ఎకరాల 15 గుంటల భూమి కేటాయించిందన్నారు. యేటా కనీసం 500 మంది విద్యార్థులు పాఠశాల నుంచి బయటకు వెళ్తారని పేర్కొన్నారు. పాఠశాల భవన నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ గురుకులంతో మండల రూపురేఖలు మారుతాయన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ ఆర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్ కోట్నాక తిరుపతి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేంచంద్, వైస్ చైర్మన్ ఆరీఫ్, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, నాయకులు, అధికారులు ఉన్నారు.

సమస్యలు తలెత్తకుండా భద్రతా చర్యలు

- రామగుండం సీపీ శ్రీనివాస్
- కల్వరీ పాస్టర్ ప్రవీణ్ ఉపవాస దీక్ష విరమణ సభ బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

సభా స్థలాన్ని పరిశీలిస్తున్న రామగుండం సీపీ శ్రీనివాస్

కాసిపేట, అక్టోబర్ 11 : కల్వరీ చర్చి పాస్టర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఉపవాస దీక్ష విరమణ సభకు సమస్యలు తలెత్తకుండా భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్వరీ చర్చి ఆధ్వర్యంలో 17వ తేదీన కల్వరీ పాస్టర్ ప్రవీణ్ 50 రోజులు ఉపవాస దీక్ష విరమణ కార్యక్రమంలో భాగంగా భారీ సభ ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమైన ప్రజా ప్రతినిధులు, ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి భక్తులు, ప్రజలు సుమారు 1.50 లక్షల మందికి పైగా పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మంచిర్యాల డీసీపీ భాస్కర్‌తో కలిసి భద్రత, బందోబస్తు ఏర్పాట్లు, హెవీ వెహికిల్ పార్కింగ్, వీవీఐపీ వెహికిల్ పార్కింగ్, భోజన, సభా వేదికలను సందర్శించారు. భద్రతా పరమైన ఏర్పాట్లను పరిశీలించారు. వాహనాల పార్కింగ్, సభకు వచ్చే మార్గాలపై అధికారులతో పోలీస్ కమిషనర్ చర్చించారు. పూర్తిస్థాయిలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లకు అవసరమైన చర్యలపై పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి అడిషనల్ డీజీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రా రావు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్ రావు, మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, ఆర్ఐ వామనమూర్తి, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్, చర్చి నిర్వాహకులు మత్తునేని రవి కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు కోసం ఎదురు చూపులు

బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 11 : దసరా పండుగ సందర్భంగా పట్టణం నుంచి వివిధ పల్లెలకు వెళ్లే ప్రజలు శనివారం బస్సులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంటలకొద్దీ ఆసిఫాబాద్ ప్రయాణ ప్రాంగణంలోనే బస్సుల కోసం వేచి చూశారు. పండుగ పూట బస్సుల సంఖ్య పెంచితే ఇబ్బంది ఉండేది కాదని ప్రయాణికులు పేర్కొన్నారు.

లింగ వివక్ష వీడాలి

వాంకిడి, అక్టోబర్ 11 : బాలికలపై జరుగుతున్న హింస, వేధింపుల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ డోంగ్రి ప్రవీణ్ కుమార్ కోరారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వాంకిడి మండలం ఇంధాని గ్రామ పంచాయతీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్, మాజీ వార్డు సభ్యుడు శ్రీకాంత్, చైల్డ్ లైన్ సూపర్‌వైజర్ దుర్గం పితాంబర్, చైల్డ్ లైన్ కేసు వర్కర్ సుఖన్య, అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ, గోవర్దన్, నానయ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మందమర్రి రూరల్, అక్టోబర్11 : మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని చేత్లపూర్ తోటలో పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. సమాచారం మేరకు అక్కడికి వెళ్లి, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. రూ.15,720, ఐదు మొబైల్ ఫోన్లు, మూడు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సీజ్ చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

కోటపల్లి : వెంచపల్లి సమీపంలో ప్రాణహిత వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కోటపల్లి, అక్టోబర్ 11 : పల్లెల్లో బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో చిన్నా, పెద్దా తేడా లేకుండా శుక్రవారం తెల్లారేవరకు ఆట పాటలతో బతుకమ్మను కొలిచారు. ప్రాణహిత, గోదావరి, చెరువుల్లో ఉదయం నిమజ్జనం చేశారు. కెనడాలో తెలంగాణవాసులంతా ఒక చోట చేరి, బతుకమ్మ సంబురాలు నిర్వహించారు.

కౌటాల : శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కౌటాల, అక్టోబర్ 11 : కౌటాల మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల్లో గురువారం రాత్రి సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు సాంప్రదాయ ఆట పాటలతో బతుకమ్మ ఆడారు. అనంతరం సమీపంలోని చెరువులో నిమ్మజ్జనం చేశారు.

సీఎస్ఐ చర్చిలో యూత్ రిట్రీట్

మందమర్రి రూరల్, అక్టోబర్ 11 : పట్టణంలోని సీఎస్ఐ సేయింట్ థామస్ చర్చిలో శుక్రవారం వన్ డే రీజనల్ యూత్ రిట్రీట్ కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. రీజియన్ చర్చి యూత్ సభ్యులు పాల్గొని ఆటపాటలు, నాటికలతో అలరించారు. చర్చి పాస్టర్ రెవ జేర్మియా మాట్లాడుతూ.. యువత భక్తి మార్గంలో నడుచుకోవాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. పాటలు, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సీఎస్ఐ చర్చి యూత్ కార్యదర్శి నక్క కమల్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్, చెన్నూర్, మంచిర్యాల తదితర ఏరియాల్లోని చర్చి యువతీయువకులు సుమారు 200 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బడికెల రవి, కిషోర్, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా ముందుకుసాగాలి

మాట్లాడుతున్న మేనేజర్ తిరుపతి

శ్రీరాంపూర్, అక్టోబర్ 11 : సింగరేణి సంస్థపై ప్రతీ ఉద్యోగి బాధ్యతగా ముందుకుసాగాలని ఆర్కే-6గని మేనేజర్ తిరుపతి సూచించారు. శ్రీరాంపూర్ ఆర్కే-6 గనిపై మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం ఉజ్వల భవిష్యత్-ఉద్యోగుల పాత్రపై సదస్సు నిర్వహించారు. కార్మికులకు సంస్థపై పూర్తి అవగాహన కల్పించేందుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఏజెంట్ శ్రీధర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, సేఫ్టీ ఆఫీసర్ కాదాసి శ్రీనివాస్, డిప్యూటీ మేనేజర్ కొమురయ్య, రామనర్సయ్య, వెంటిలేషన్ ఆఫీస్ ఎస్‌పీ వర్మ, సర్వే ఆఫీసర్ మహేశ్, సీనియర్ పీవో సురేందర్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సంగం సదానందం, ఏరియా కార్యదర్శి చిలుక రాంచందర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపాలి

రాష్ట్రస్థాయికి ఎంపికైన వారితో ఏఎస్పీ ప్రభాకర్ రావు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 11 : పోలీస్ డ్యూటీ మీట్‌లో భాగంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన వారు ఉత్తమ ప్రతిభ చూపి, జిల్లాకు పేరు తేవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు ఆకాంక్షించారు. ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో రాష్ట్రస్థాయికి ఎంపికైన వారికి ప్రశంసా పత్రాలు అందేశారు. ప్రత్యేకంగా అభినందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని తెలిపారు.

ఆర్మీ జవాన్‌కు ఘన సన్మానం

వాంకిడి, అక్టోబర్ 11 : మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన వాడై శ్రీరామ్ ఆర్మీ ఉద్యోగం సాధించాడు. ఇటీవలే శిక్షణ పూర్తిచేసుకొని స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా శుక్రవారం ఆయనను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ గౌరయ్య, బాపూరావ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ముగిసిన వాలీబాల్ క్యాంప్

దుస్తులు అందుకున్న విద్యార్థులు

దండేపల్లి, అక్టోబర్ 11 : దండేపల్లి మండలం తాళ్లపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పది రోజుల పాటు నిర్వహించిన వాలీబాల్ క్యాంప్ శుక్రవారం ముగిసింది. ఉన్నత లక్ష్యంతో నేర్పించిన అంశాలను విద్యార్థులు నిరంతరం సాధన చేయాలని పలువురు సూచించారు. తాళ్లపేట గల్ఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేల విలువ గల క్రీడా దుస్తులు అందజేశారు. మాజీ ఎంపీటీసీ కంది హేమలత–సతీశ్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్ పుట్టపాక తిరుపతి, సీనియర్ జర్నలిస్టు ముస్తఫా, గల్ఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు సందెల మల్లేశ్, కోచ్ బోడ కుంట మహేశ్(పులి), నిర్వాహకులు అఫ్రోజ్, రాజు, రమేశ్, గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

పశువుల కాపరి కొడుకు స్కూల్ అసిస్టెంట్

సంతపూరి అశోక్

జన్నారం, అక్టోబర్ 11 : మండలంలోని మొర్రిగూడ గ్రామానికి చెందిన పశువుల కాపరి సంతపూరి చిన్నులు–మల్లవ్వ దంపతుల చిన్న కొడుకు సంతపూరి అశోక్ స్కూల్ అసిసెంట్ ఉద్యోగాన్ని సాధించాడు. మంచిర్యాల జిల్లాలో 21వ ర్యాంక్ సాధించి, మొదటి కేటగిరీలో ఉద్యోగాన్ని సాధించి ఆదర్శంగా నిలిచాడు. నాన్న ప్రోత్సహంతో కష్టపడి చదువుకొని ఉద్యోగాన్ని పొందాడు.

తోటి మిత్రుడికి ఆర్థిక సాయం

బాధిత కుటుంబానికి సాయం చేస్తున్న స్నేహితులు

జైపూర్, అక్టోబర్ 10 : అనారోగ్యంతో బాధపడుచున్న తోటి మిత్రుడికి అమిగోస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.30 వేలు సాయం అందించారు. జైపూర్ ప్రభుత్వపాఠశాలలో 2002–03లో పదోతరగతి చదివిన విద్యార్థులు వారి చిన్ననాటి స్నేహితుడు, జైపూర్‌కు చెందిన సముద్రాల రాజు అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకొని సాయం అందించి, స్నేహితుడికి ధైర్యమిచ్చారు. అమిగోస్ వెల్ఫేర్ సొసైటీని ఏర్పాటు చేసుకొని తమలో ఎవరికి ఆపద వచ్చినా, అవసరం వచ్చినా సాయం చేసుకుంటున్నట్లు వివరించారు.

రామ్‌లీలా ఏర్పాట్లు పూర్తి

బెల్లంపల్లి, అక్టోబర్ 11 : విజయ దశమిని పురస్కరించుకొని పట్టణంలోని తిలక్‌స్టేడియం ఆవరణలో నిర్వహించే రామ్‌లీలా కార్యక్రమానికి హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. 70 అడుగుల ఎత్తులో ఆకర్షణీయమైన రంగులతో విగ్రహాన్ని తీర్చిదిద్దారు. శనివారం రాత్రి ఈ కార్యక్రమాన్ని ప్రజలు తిలకించేందుకు పెద్ద ఎత్తున తరలివస్తారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దుస్తుల పంపిణీ

హాజీపూర్, అక్టోబర్ 11 : మండలంలోని సబ్బెపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పారిశుధ్య కార్మికులకు తహసీల్దార్ శ్రీనివాస్ రావ్ దేశ్ పాండే దుస్తులు పంపిణీ చేశారు. దసరా పండుగ సందర్భంగా యేటా దుస్తులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు, కారోబార్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బెజ్జూర్, అక్టోబర్ 11 : మండలంలోని మర్తిడిలో చొప్పదండి మల్లయ్య ఉటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కోనప్ప శుక్రవారం పరామర్శించారు. మల్లయ్య భార్య ఇటీవల మృతి చెందగా, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం సలుగుపల్లి నుంచి పెంచికల్‌పేట వరకు కోనేరు అభిమానుల ఆధ్వర్యంలో రోడ్డుపై మొరం పోయించారు. మరమ్మతులను పరిశీలించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాసం శ్రీనివాస్, నాయకులు బషారత్ ఖాన్, సిడాం సకారాం, డోకె వెంకన్న, పూల్లూరి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతుల పరిశీలన

బెజ్జూర్, అక్టోబర్ 11 : మండలంలోని కుశ్నపల్లి–సోమిని రోడ్డు మరమ్మతులను శుక్రవ